# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 20 డిసెంబరు, 2025 | పేజీలు :06


## నేడు 'మీ డబ్బు-మీ హక్కు'పై ప్రత్యేక శిబిరం

### కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఈనెల 20వ తేదీన(శనివారం) కలెక్టరేట్లో 'మీ డబ్బు మీ హక్కు' అనే అంశంపై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం తెలిపారు.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు బ్యాంకుల్లో సంవత్సరాలుగా క్లెయిమ్ చేసుకోని డబ్బుకు సంబంధించి అవకాశం కల్పించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.బ్యాంకులలో పొదుపు,షేర్లు,మ్యూచువల్ ఫండ్స్,డివిడెంట్స్,బీమాలు క్లెయిమ్ చేసుకునేందుకు ఈ శిబిరం అవకాశం కల్పిస్తుందని అన్నారు. ద్వారా 10 సంవత్సరాలకు పైబడి బ్యాంకుల్లో క్లెయిమ్ చేసుకుని నిల్వ వివరాలు ఆర్బి ఉద్గం వెబ్సైట్లో పొందవచ్చునని పేర్కొన్నారు. నిజమైన హక్కుదారులకు బ్యాంకుల్లోనే డబ్బులు పొందేందుకు ఈ శిబిరం ఆవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# కొలువుదీరనున్న గ్రామ కొత్త సారథులు

### ముస్తాబవుతున్న పంచాయతీలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** పంచాయతీ ఎన్నికల కోలాహలం ముగిసింది. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియ బుధవారంతో పూర్తికావడంతో ఇప్పుడు అందరి దృష్టి బాధ్యతల స్వీకారంపై మళ్లింది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఈ నెల 22వ తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు ఈ కార్యక్రమం జరగనుండటంతో గ్రామాలు పండగ వాతావరణం సంతరించుకుంటున్నాయి. సర్పంచులు తమ తొలి అడుగు చిరస్మరణీయంగా మార్చుకోవాలని తపిస్తున్నారు. చాలాచోట్ల పంచాయతీ కార్యాలయాలకు కొత్త రంగులు వేయిస్తూ విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో సర్పంచ్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత ఖర్చులతో కార్యాలయాలకు మరమ్మతులు చేయిస్తూ రంగులు వేయిస్తున్నారు. సర్పంచ్ చాంబర్తో పాటు వార్డు సభ్యుల కోసం ప్రత్యేకంగా పర్నిచర్ను సిద్ధం చేస్తున్నారు. కొందరు సర్పంచులు తమ పదవీ కాలం సాఫీగా సాగాలని వాస్తు దోషాలను సరిచేయించుకుంటూ కార్యాలయాల్లో మార్పులు చేస్తున్నారు. ఇప్పటికే భారీగా ఖర్చు చేసిన అభ్యర్థులు, ఇప్పుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కూడా ఒక ఉత్సవంలానిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పల్లెల్లో తమ పట్టు నిలుపుకోవాలని, ప్రజల్లో గుర్తింపు పొందాలని పెద్ద మొత్తం వెచ్చిస్తున్నట్లు తెలుస్తుంది. భారీ ఉరేగింపులు, విందు వినోదాలతో పండగ వాతావరణాన్ని తలపించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పాలనలో ఏకరూపత ఉండాలని ప్రభుత్వం ఈ నెల 22న అందరూ బాధ్యతలు చేపట్టాలని గడువు విధించింది. ఆ రోజు పంచాయతీల్లో సందడి నెలకొననుంది. గెలిచిన వారంతా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నారు.




# కరీంనగర్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్ ప్రఫూల్ దేశాయ్

**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరపాలక సంస్థ పరిదిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని ఇంజనీరింగ్ అధికారులను మున్సిపల్ కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో బాగంగా శుక్రవారం కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. మొదటగా నగరంలోని టవర్ సర్కిల్ సమీపంలో వేసిన బీటి రోడ్డు పనులను తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం అమరవీరుల స్థూపం సమీపంలో మంచి నీటి సరఫరా పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను తనిఖీ చేశారు. పైపులైన్ లీకేజీని త్వరగా అరికట్టాలని ఆదేశించారు. మరోవైపు సమీపంలోని ఐడిఎస్ఎమ్ టీ భవనం అధునీకరణపనులను తనిఖీ చేశారు. అనంతరం మానేరు డ్యాం సమీపంలో గతంలో నగరపాలక సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ట్రాక్ ఇరువైపులా నాటిన పండ్ల మొక్కలను, స్థానికంగా ఉన్న ఓపెన్ జిమ్మును తనిఖీ చేసి పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి మరమ్మతు పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ... అమరవీరుల స్థూపం సమీపంలో గల మంచి నీటి పైపులైన్ మరమ్మతు పనులను త్వరగా అరికట్టాలన్నారు. గత 30 సంవత్సరాల క్రీతం వేసిన మంచి నీటి పైపులైన్ కాబట్టి తరుచుగా లీకేజీలు సంభవిస్తే శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీస్కోవాలని అధికారులను ఆదేశించారు. జనవరి 1 లోగా ఐడీఎస్ఎంటీ భవన్ అధునీకరణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని అధికారులను ఆదేశించారు. మానేరు డ్యాం నుండి వచ్చే సీఫేజీ వాటర్ కు కచ్చనాల ద్వారా నీటిని మళ్లించేలా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. వాకింగ్ ట్రాక్ లో స్టోన్ డస్ట్ వేసేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్ ఇరువైపులా ఇటీవల నాటిన పండ్ల మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. స్థానికంగా ఉన్న ఓపెన్ జిమ్ము చెడిపోయిన పరికరాలను త్వరగా రిపేర్ చెసి, వాకర్స్ కు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సప్తగిరి కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ కోసం స్థల పరిశీలన చేసి, హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం పనులను ప్రారంభించేలా చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# బిపిఎల్ పవర్ప్లాంట్లో పెద్దపులి!




### ప్రాణాలతో బయటపడిన మహిళా కాపరి

### అడుగులను గుర్తించిన ఫారెస్టు అధికారులు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పట్టణంలో నిర్మాణంలో నిలిచిపోయిన బిపిఎల్ పవర్ ప్లాంటులోని చిట్టడవిలో శుక్రవారం పెద్దపులి ప్రత్యక్ష్యమైంది. సమీప మల్యాలపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి కత్తెరమల్ల కుమారి పెద్దపులిని అతి దగ్గరగా చూసింది. ప్రతిరోజు లాగానే మేకలను మేపేందుకు ఆమె పవర్ ప్లాంటు ప్రదేశంలోకి వెళ్లింది. మేకలు మేస్తుండగా ఆమె ఒకచోట కూర్చొని ఉంది. అయితే కొద్దిసేపటికి మేకలు భయంతో అరుస్తూ పారిపోవడం గమనించింది. వాటి వద్దకు వెళ్లి చూసింది. కొద్ది దూరంలోనే చెట్ల పొదల్లో ఉన్న పెద్దపులి ఆమెకు కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయంతో పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టింది. పవర్ ప్లాంటు ప్రదేశం నుంచి బయటకు వచ్చింది. ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అటవీ, పోలీసుశాఖల అధికారులు కుమారిని తీసుకొని పెద్దపులి కనిపించిన ప్రదేశానికి వెళ్లి చూశారు. అక్కడ పెద్దపులి కాలి అడుగుల గుర్తులను గుర్తించారు. ఇటీవల సింగరేణి మేడిపల్లి ఒసిపి4 ప్రాజెక్టు వద్ద కనిపించిన పెద్దపులి కాలి అడుగులే ఇక్కడ కూడ కనిపించాయి. దీంతో ఆ పులి బిపిఎల్ పవర్ ప్లాంటు ప్రదేశానికి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. రామగుండం పట్టణం, రైల్వేస్టేషన్ ఏరియా ప్రజలతో పాటు మల్యాలపల్లి, బద్రిపల్లి, కుందనపల్లి, ఐవోసిఎల్ ఏరియా ప్రాంతాల ప్రజలను అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. పెద్దపులి సంచరిస్తున్నందున ఏవరూ కూడ ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా కాపరులు పశువులతో నిర్మానుష్య ప్రదేశాల్లోకి వెళ్లకూడదని,తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను హెచ్చరించారు. కాగా, పెద్దపులి రామగుండం పట్టణానికి అతి సమీపంలోకి రావడంతో అంతటా భయాందోళన వాతావరణం నెలకొంది.



# జాన్కంపేట్‌లో అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శుక్రవారం బిక్షాటన పేరుతో గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం గ్రామంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బిక్షాటన చేస్తూ ఇళ్ల మధ్య తిరుగుతూ, అనుమానస్పదంగా వ్యవహరించడం గ్రామస్తుల దృష్టికి వచ్చింది. వారు అడిగిన ప్రశ్నలకు సదరు వ్యక్తులు పొంతన లేని సమాధానాలు, పేర్లలో తేడాలు, బిక్షాటన చేస్తూ మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ వచ్చామని చెప్పడంతో స్థానికులకు అనుమానం బలపడింది. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు వారిని నిలదీసి, అనంతరం ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ వ్యక్తులు ఎక్కడి నుంచి వచ్చారు..? బిక్షాటన ముసుగులో ఏవైనా నేరాలకు పాల్పడే ఉద్దేశం ఉందా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.



## గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అమావాస్య అన్న ప్రసాదం కార్యక్రమంలో శుక్రవారం అమావాస్యలో భాగంగా 30వ మాసాన్ని పురస్కరించుకుని. దాతలు అల్లెంకి ఆంజనేయులు ధనలక్ష్మి ,గౌరిశెట్టి భూమయ్య పద్మ, కుటుంబ సభ్యులకోరిక మేరకు నిర్వహించారు. గత 29 నెలల నుండి దాతల సహకారంతో విజయవంతంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతుందని వ్యవస్థాపక అధ్యక్షులు కాసనగొట్టు వినయ్ తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ రావికంటి రాజు, ఉపాధ్యక్షులు చిట్టి మల్ల రవి,కోశాధికారి కటకం సత్యనారాయణ,జాయింట్ సెక్రటరీ నాగమల్ల శ్రీనివాస్ మరియు సభ్యులు బొల్లం ఆంజనేయులు,గౌరిశెట్టి సాయి శివ, సంతోష్, గుండ సాయి వర్మ, పైడావిజయ్ ,ముస్త్యాల ప్రదీప్, భాస్కర్ ,బొల్లం శ్రీనివాస్, పాల్గొన్నారు.

## యేసుక్రీస్తు జన్మ పవిత్రమైనది : పాస్టర్ కలవల సామ్యూల్



**ప్రజాపక్షం/ముత్తారం :** యేసుక్రీస్తు జన్మ అత్యంత పవిత్రమైనదని సీయోను చర్చ్ పాస్టర్ కలువల సామ్యూల్ అన్నారు. శుక్రవారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పండుగ సంతోషం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. అడవి శ్రీరా పూర్ ముత్తారం గ్రామాల్లో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించి, క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీయోను సంఘముల పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయారాజు, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకె జోసఫ్ మంథని ప్రసాద్, సదా నందం, (తిమోతి), పారునంది రయ్య, శ్రీనివాస్ లతోపాటు పాల్గొన్నారు.

## అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయలను ఆధునిక పద్ధతులతో సాగుచేయాలి

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలోని పలు కూరగాయ క్షేత్రాలను శుక్రవారం జగిత్యాల జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ పరిశీలించారు. 10 ఎకరాలలో వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తున్న మహిళా రైతు పొలేపు వసంత క్షేత్రాన్ని సందర్శించి ఆధునిక డ్రిప్, మల్చింగ్ పద్ధతులతో పాటు డ్రిప్ ద్వారా ఎరువులను కూడా అందిస్తున్నందుకు మహిళా రైతు పొలేపు వసంత అభినందించారు. 10 ఎకరాలలో టమాటో, బీర, కాకర, సొర, దోస వంటి కూరగాయల తో సంవత్సరానికి ఖర్చులు పోగా 25 లక్షల ఆదాయాన్ని పొందుతున్నట్లు మహిళా రైతు పొలేపు వసంత తెలిపారు. జగిత్యాల జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కూరగాయ తోటలను ఆశించే వివిధ రకాల చీడ పీడల గురించి వాటి నివారణకు చేపట్టే చర్యల గురించి రైతులకు వివరించడం జరిగిందని రైతులు సాంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్నిచ్చే వివిధ రకాల కూరగాయలను కూడా సాగుచేయాలనీ, ఆధునిక సాంకేతిక పద్ధతులైన మల్చింగ్, డ్రిప్ పద్ధతులతో కూరగాయలను సాగు చేస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని, ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగును ప్రోత్సాహించడానికి కూరగాయలు వేసే ఎస్.సి, ఎస్.టి రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందు ఖర్చుల నిమిత్తం ఎకరానికి 9600/ సబ్సిడీ అందజేస్తున్నట్లు, ఆసక్తి గల రైతులు సంబంధిత ఉద్యాన అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. అధికారి అనిల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ దినోత్సవల ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక ఐక్యత పెంపొందుతాయి

కళాశాల అసోసియేట్ డీన్ ఇన్‌చార్జి డా.పి.సుజాత







**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల పొలాస జగిత్యాలలో సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాంప్రదాయ దినోత్సవం(ట్రెడిషనల్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల అసోసియేట్ డీన్ ఇంచార్జి డా.పి.సుజాత హాజరైయ్యారు. సాంప్రదాయ దినోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకుని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్యాలు, గీతాలు, ప్రదర్శనలను ఉత్సాహంతో విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా రాష్ట్రాల వారీగా సంప్రదాయ దుస్తులు, ఆహారపు అలవాట్లు, కళా రూపాలను ప్రదర్శించడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందన్నారు.కళాశాల అసోసియేట్ డీన్ ఇంచార్జి డా.పి.సుజాత భారతీయ సంస్కృతి మనకు అందించిన విలువలు, ఆచారాలు యువత కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అసోసియేట్ డీన్ ఇంచార్జి తెలిపారు. విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అసోసియేట్ డీన్ ఇంచార్జి డా.పి.సుజాత తెలిపారు. కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జి డా.బి .సౌజన్య, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి డా.వి .రత్నాకర్, అకాడమిక్ ఇంచార్జ్ డా.జి.సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, కల్చరల్ క్లబ్ విద్యార్థులు లక్ష్మి ప్రసన్న, అగ్రజ్ వర్మ, ఆయుష్ కుమార్, నస్రీన్ మరియు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీలు మారకుంటే బిఆర్ఎస్ సమావేశానికి హాజరుకండి

ఎమ్మెల్యేలకు సవాల్ విసిరిన బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్



**ప్రజాపక్షం / హుజూరాబాద్ :** బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొంది కాంగ్రెస్‌లోకి చేరిన పదిమంది ఎమ్మెల్యేలు తాము ఏ పార్టీలో చేరలేదని ప్రగల్భాలు పలుకుతున్నారని, నిజంగా ఎమ్మెల్యేలు పార్టీ మారకుంటే ఈ నెల 21న జరిగే టిఆర్ఎస్ సమావేశానికి హాజరు కావాలని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ సవాల్ విసిరారు. బిఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచి వేరే పార్టీకి పోయిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి శుక్రవారం హుజురా బాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గెలిపించిన ప్రజలను మోసం చేస్తూ పార్టీ మారి ఇప్పుడు చర్యలు తీసుకునే సమయానికి తగు పార్టీలు మారలే దంటూ దొంగ మాటలు మాట్లాడు తున్నారని అన్నారు. నిజంగా పార్టీ మారితే దమ్ముంటే బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఇప్పటికైనా పార్టీ నుండి వెళ్లిన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని చెప్పడంలో నిజాయితీ ఉంటే తప్పక టిఆర్ఎస్ సమావేశానికి హాజరుకావాలని అన్నారు. పార్టీ మారిన ప్రజా ప్రతినిధులుప్రజల ముందు దోషులుగా నిలబడతారని భవిష్యత్తులో వారికి తగిన గుణపాఠం కూడా ప్రజలు చెబుతారని అన్నారు.

## యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని 22 నుండి యథావిధిగా నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## యూరియా బుకింగ్‌పై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం / చందుర్తి :** త్వరలో అందుబాటులోకి రానున్న యూరియా బుకింగ్ యాప్ పై మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో అవగాహన కల్పించినట్లుగా చందుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు తెలిపారు.మండలం లోని చందుర్తి , మల్యాల , మూడపల్లి గ్రామాలలో రైతు వేదిక భవనాల్లో , సనుగుల , అనంతపల్లి గ్రామాల్లో రైతులకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశామన్నారు.ఈ యాప్ అందుబాటులోకి వచ్చిన తర్వాత జిల్లా లోని ఏదైనా అధీకృత రిటైలర్ లేదా ప్యాక్స్ కేంద్రం నుండి యూరియా కొనుగోలు చేయవచ్చున్నారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ముక్కోటికి మంత్రిని ఆహ్వానించిన ఆలయ అధికారులు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో ఈనెల 30న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలకు ఆహ్వానం పలుకుతూ శుక్రవారం ఆలయ అధికారులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసారు.ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ పాలక మండలి అధ్యక్షులు జక్కు రవీందర్,మాజీ అధ్యక్షులు ఎస్.దినేష్, అర్చకులు,ధర్మకర్తల మండలి సభ్యులు మంత్రి అడ్లూరి ని కలిసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందించారు .ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆలయ భాద్యులకు సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

## బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/చొప్పదండి:** ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన రాగంపేట గ్రామ వార్డు సభ్యురాలు, యువ న్యాయవాది, గసికంటి సోనియాకుమార్ దంపతులను ఆయన సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబుల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి అద్భుతమైన జానపద పాటలు రాసిన సోనియాకుమార్ ప్రభుత్వ వైద్యంపై భరోసాతో, ప్రభుత్వ ఆసుపత్రుల నాణ్యమైన ప్రసూతి సేవలను సమాజంలో ప్రచారం కల్పించడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మనివ్వడం సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకుంటూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నారని, అదే బాటలో విద్యావంతులు, యువత సామాన్యులను ప్రోత్సహించాలని కోరారు. గత ఆరేళ్లలో చొప్పదండి, కరీంనగర్, హుజురాబాద్ సహా జిల్లాలోని వివిధ ప్రధాన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ సిఎస్ఆర్ తదితర నిధులు ద్వారా 15 కోట్ల విలువ చేసే వివిధ పరికరాలు అంబులెన్సులు బెడ్లు కిట్లు అందజేశారని పరిశ్రమలు దాతలు, నాయకులు కరీంనగర్ ఎంపీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదర్శంగా ఇదే బాటలో నడుస్తూ ఆసుపత్రులకు సహాయం చేయాలని కృష్ణారెడ్డి కోరారు. అనంతరం డాక్టర్లను, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ మండల అధ్యక్షులు మొగిలి మహేష్, రాపల్లి శ్రీనివాస్, గుండె వెంకటేష్, ఉడుత రాము, గసికంటి విశేష్, బండారి శోభ, రమ్యశ్రీ, రాజేశ్వరి,శారద కొమురమ్మ పాల్గొన్నారు.



## పోటోగ్రాఫర్స్ ఆధునిక టెక్నాలజీని అంది పుచ్చుకోవాలి



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** వీడియో గ్రాఫర్స్ సర్వసభ్య సమావేశం శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సమావేశానికి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, సలహాదారు కేదార్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, గంగాధర్, రవీందర్ అధ్యక్షతన సమావేవం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఐక్యంగా ఉంటూ ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఫొటో వీడియో ఆధునిక రంగాలలో ఏవిధంగా రాణించాలి కొత్త టెక్నికల్లు తెలుసుకుని వర్క్‌షాప్‌లో అటెండ్ కావలని సూచించారు. కుటుంబ భరోసా పథకాన్ని ప్రతి సభ్యులు కట్టాలని సూచించారు. ఫొటోగ్రఫీ రోజురోజుకు కొత్త పద్ధతులతో కొత్త కెమెరాలు మార్కెట్‌లో లభ్యమవుతుండటంతో వాటికనుగుణంగా ఫొటోగ్రాఫర్ కూడా మారాలి క్రియేటివిటితో ఫొటోగ్రఫీ చేస్తే ఫొటోగ్రాఫర్ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఫొటోగ్రాఫర్ భవిష్యత్తు వారి ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుందని కష్టమర్లతో మర్యాదగా వారిని ఆకట్టుకునేలా ఫొటోలో నాణ్యత ఇవ్వటంతో మళ్లీ అవకాశాలు వచ్చే అవకాశముంటుందని సూచించారు. వినయ్, ప్రవీన్, లింగమూర్తి, నర్సయ్య, అమీర్, పవన్, సంపత్ పాల్గొన్నారు.

## 'సింగరేణి' ఆటల పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గోదావరిఖని జీఎం కాలనీ క్రీడా మైదానంలో మహిళలకు ఆటల పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఆర్‌జి1 ఏరియా పర్సనల్ మేనేజర్ ఎం. రవీందర్‌రెడ్డి, సేవా సమితి సెక్రటరి బీనాసింగ్‌లు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు .విజేతలకు ఈనెల 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలి పారు. సీనియర్ పివో హనుమంతరావు, సేవా సమితి జాయింట్ సెక్రటరి రజిత, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేష్, కోఆర్డినేటర్‌లు సమాల సత్యనారాయణ, మేడి తిరుపతిలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం తొలగించి జాతీయ పూజ్య బాపు ఉపాధి హామీ (వీబీ జీ రాం జీ) గా మార్చడం కుట్ర పూరిత చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూతన్ కుమార్ ఆరోపించారు.ఖానాపూర్ పట్టణంలో వారు పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం విలేఖర్లుతో మాట్లాడారు.మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేరును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.తరచూ రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్తున్న బీజేపీ సర్కార్ మూడోసారి అధికారంలోకి రావడంతో ఆ పనులను మొదటుపెట్టిందని ఆరోపించారు.రాష్ట్రాలకు నిబంధలనతో క్రమక్రమంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసి,పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.మహాత్మ గాంధీ పేరునే కొనసాగించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఎం పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

### మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్

**ప్రజాపక్షం/బోధన్:** భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు అధైర్య పడొద్దని, వారికి అండగా ఉంటానని కార్యకర్తలకు, నాయకులకు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ భరోసా ఇచ్చారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తన నివాసంలో బోధన్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారాస కార్యకర్తలు గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ లుగా వార్డు సభ్యులుగా పోటీ చేసి గెలుపొందిన వారికి అభినందనలు తెలిపి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోధన్ మండలంలో అక్రమ ఇసుక రవాణాకు బోధన్ అడ్డగా మారిందని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాబోవు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోటీ చేసి విజయం సాధిస్తారని జిల్లా పరిషత్ కార్యాలయాలపై జెండా ఎగుర వేస్తరని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన వారికి మరల పోటీచేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆయేషా వెల్ఫేర్ ట్రస్ట్ ఛైర్మన్ అయేషా ఫాతిమా, బిఆర్ఎస్ నాయకులు గంగారెడ్డి, వెంకటేశ్వర్ రావు దేశాయి, పెరిక రామకృష్ణ, సర్పంచ్‌లుగా గెలుపొందిన అభ్యర్థులు వార్డు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా కేంద్రంలో మెడికల్ రిప్రెజెంటేటివ్స్ ధర్నా

### ఎస్.పి.ఈ యాక్ట్ 1976 పునరుద్ధరణకు డిమాండ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్(ఎస్.పి.ఈ యాక్ట్ 1976)ని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్(టి.యం.ఎస్.ఆర్.యు)ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం ముందు మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ భారీ ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ బర్ల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కొత్త కార్మిక చట్టాల వల్ల దేశంలోని కార్మిక వర్గానికి,ముఖ్యంగా మెడికల్ రిప్రెజెంటేటివ్స్ కు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును,సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే ప్రాథమిక హక్కును కూడా కాలరాసేలా ఈ చట్టాలు ఉన్నాయని ఆయన విమర్శించారు.మెడికల్ రిప్రెజెంటేటివ్స్ కోసం ప్రత్యేకంగా గతంలో ఏర్పాటు చేసిన ఎస్.పి.ఇ యాక్ట్ 1976 ను రద్దు చేయడం వల్ల దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఫారం ఎ ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్లు రావడం లేదని,దీనివల్ల కనీస వేతన చట్టం, బోనస్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధమైన హక్కుల అమలు ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రవీణ్ బర్ల పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను యథావిధిగా అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాలకు అనుగుణంగా రూల్స్ రూపొందిస్తే,గతంలో యూనియన్ ఇచ్చిన సలహాలను,ఎస్.పి.ఇ యాక్ట్ 1976 నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.పపఅనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి పంపాలని కోరుతూ జిల్లా కార్మిక శాఖ అధికారులకు అందజేశారు.నిన్ననే హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద వేలాది మందితో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై భారీ ధర్నా నిర్వహించామని ఈ సందర్భంగా వారుగుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ సబ్ యూనిట్ నాయకులు జి.రాజశేఖర్,బి.ప్రవీణ్,పెద్ద సంఖ్యలో మెడికల్ రిప్రెంజెంటేటివ్‌స పాల్గొన్నారు.



## వర్ని మండలంలో నకిలీ నోట్ల కలకలం

**ప్రజాపక్షం/బోధన్:** వర్ని మండలంలో దొంగనోట్ల కలకలం రేపింది. వర్ని ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని కెనరా బ్యాంక్‌లో క్రాప్ లోన్ కట్టడానికి వచ్చిన జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు నరేడ్ల చిన్న సాయిలు మొత్తం రూ. 2,08,500 తన ఖాతాలో జమ కోసం బ్యాంకులో క్యాషియర్ కు ఇచ్చారు. క్యాషియర్ కౌంటింగ్ మిషన్లో డబ్బు వేయగా 417(రూ.500) నకిలీ నోట్లు ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు. 417 నోట్లు నకిలీ నోట్లని తేలడంతో కెనరా బ్యాంక్ మేనేజర్ పంకాజ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం కల్దుర్కి, రాంపూర్ గ్రామ శివారులో ఇసుక రవాణా ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న రాములు(60) అనే వ్యక్తి మృతి చెందారు. శుక్రవారం ఉదయం బోధన్ మండలం మంజీరా పరివాహక ప్రాంతం కల్దుర్కి గ్రామం నుంచి బోధన్ వైపు అతివేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని రాంపూర్ గ్రామ శివారులో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే దీనికి కారణం అంటూ స్థానికులు ఆరోపించారు. ట్రాక్టర్ ఢీకొనడంతో కల్దుర్కి గ్రామానికి చెందిన రాములు అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

## బోధన్ పట్టణంలో విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/బోధన్:** మూడవ శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా బోధన్ పట్టణంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని శనివారం మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులలో భాగంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## శభాష్..సాయి తేజ..

### గ్రూప్ 4లో ఉద్యోగం చేస్తూ..గ్రూప్ 3 కి ఎంపిక..



**ప్రజాపక్షం/కుంటాల :** మండల కేంద్రానికి చెందిన తాటి మహేష్ శోభ దంపతుల మొదటి కుమారుడు తాటి సాయితేజ గ్రూప్ 3లో ఉద్యోగానికి ఎంపిక అయ్యాడు. సామాన్య మధ్యతర గతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సాయి తేజ పోటీ పరీక్షల్లో వరుస విజయాలు సాధిస్తున్న అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడూ..గత ఏడాది గ్రూప్ 4లో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికై బైంసా సబ్ కలెక్టర కార్యాలయంలో విధులు నిర్వ హిస్తున్నాడు.తాజాగా వెలువడిన గ్రూప్ 3 ఫలితాల్లో హోమ్ శాఖ సీ.ఐ.డీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా తాటి సాయి తేజను గ్రామస్తులు ,యువకులు ,ఉద్యోగులు,అభినందించారు.

# నూతన సర్పంచ్, వార్డు సభ్యులకు ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని స్థానిక రెడ్డి సంఘ భవనంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, రజక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల మహేష్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన రజక కుల బాంధవులు సర్పంచ్ ,వార్డ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ , వార్డు సభ్యుల గెలుపొందిన రజక కుల బాంధవులు ఓరుగంటి తిరుపతి (సర్పంచ్ బిబి రాజుపల్లి) తిరుమలాపురం ఐదవ వార్డు సభ్యులు ఓగులాపురం లచ్చయ్య, గోవింద్ పల్లె 4వ వార్డు , సాయిగీత హరీష్, అగ్గిమల్ల ఒకటవ వార్డు, సట్ట గంగవ్వ నందయ్య, వెంగలాపూర్ వార్డు సభ్యులు, వనపర్తి రాజేందర్, వెలుగుమట్ల రెండో వార్డు, ఒడ్నాల వసంత స్వామి ఇస్రాజ్ పల్లి ఏడవ వార్డు, జలిగామ లత నరేష్ లను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు,రజక సంఘ మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల మహేష్ .ఈ కార్యక్రమంలో గోవిందుపల్లి రజక అధ్యక్షులు ఎనగందుల శంకరయ్య, కట్కూరిరామయ్య, నేరెళ్ల చంద్రయ్య ,సట్ట ఎల్లయ్య ,శాతల్ల రాజయ్య, ఓడ్నాల రాజేశం, శాతాల రవి, రామడుగు తిరుపతి, శాతాల్ల మహేష్, తాడూరి సంజయ్, శాతల వెంకటేష్, రజకసంఘకులబాంధవులు తదితరులు పాల్గొన్నారు.

### జూలపల్లి మండలంలో..



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జూలపల్లి మండలంలోని కుమ్మరి కుంట గ్రామానికి నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్ ప్రభుదాస్ మర్యాదపూర్వకంగా మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ని వారి నివాసంలో శుక్రవారం రోజున కలిశారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కుమ్మరి కుంట గ్రామ సర్పంచ్ ప్రభుదాస్ ను శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంధాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ , మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

### ముత్తారంలో..



**ప్రజాపక్షం/ముత్తారం :** పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో నియోజకవర్గంలోని కాటారం ,మహాముత్తారం, మహదేవ్ పూర్ మండలాల్లోని పలు గ్రామపంచాయతీల్లో విజయం సాధించిన సర్పంచ్ లను ఆయన, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిణి రాకేష్ లతో కలిసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం నమ్మకం ఉందని తేలిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పంచాయతీ ఎన్నికలు చెంప పెట్టు లాంటివని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని ఆయన దీమా వ్యక్తం చేశారు.

### అంతర్గాంలో..



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని జామా మజీదులో టిటిఎస్ అంతర్గాం సర్పంచిగా గెలుపొందిన అంబోతు రవికుమార్ నాయక్, వార్డు సభ్యులు మాడ అనిల్‌రెడ్డి, కోల సంతోష్‌లను మజీద్ కమిటి సభ్యులు శుక్రవారం శాలువాలతో సన్మానించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచి రవినాయక్ మాట్లాడుతూ, గ్రామంలోని ముస్లిం, మైనార్టీ వర్గ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికై వారు తగిన సహాయ, సహకారాలను అందించాలని కోరారు.

## క్షయ నివారణకు కృషి

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోనిమోతేవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ అలర్ట్ ఇండియా వారు టీబీ ఛాంపియన్ల కోసం శిక్షణా కార్యక్రమాన్నినిర్వహించగాశిక్షణ కార్యమానికి ముఖ్య అతిథిగాజగిత్యాలజిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ హాజరయ్యారు. కొత్త క్షయ కేసులను తొలి విడతలోనే గుర్తించి చికిత్స అందిస్తున్నామని డా.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న టీబీ నిర్మూలన చర్యలు ప్రతి ఏఏఎం సెంటర్ మరియు సబ్ సెంటర్ స్థాయిలో టీబీ లక్షణాలపై అవగాహన కార్యక్రమాల ఆవశ్యకత గురించి టీబీ ఛాంపియన్లకు వివరించడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ టీబీ సూపర్వైజర్ శ్రీనివాస్, జిల్లా లీడ్ రవి, రిసోర్స్ పర్సన్ దత్తురామ్, ప్రతి సెంటర్ నుండి వైద్య ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలున్నారు.

## వీణవంకలో విషాదం

### పదవ తరగతి విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/వీణవంకః** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన పోతరాజు రామచంద్ర(14) అనే బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. రామచంద్ర వీణవంకలోని కేరళ స్కూల్‌లో పదవ తరగతి విద్యాభ్యాసం చేస్తున్నాడు. చదువుపై పెద్దగా ఆసక్తి లేకపోగా అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్లకుండా ఉండడంతో తల్లిదండ్రులు తరచూ మందలించేవారు. చదువుపై శ్రద్ధ పెట్టాలని కుటుంబ సభ్యులు సూచించేవారు. ఈ క్రమంలో గత నెల నవంబర్ 19న ఉదయం రామచంద్రను అతని అన్న పూర్ణచంద్ర వీణవంకలోని కేరళ స్కూల్‌లో చేరవేసి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడికి వాంతులు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకుని రామచంద్రను జమ్మికుంటలోని దీక్షిత హాస్పిటల్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆర్‌జి హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి అక్కడి నుంచి యశోద హాస్పిటల్ హైదరాబాదుకు తరలించారు. మళ్లీ అస్వస్థతకు గురవడంతో తిరిగి కరీంనగర్‌లోని ఆర్‌జి హాస్పిటల్‌లో చేర్పించారు.

## ప్రజాభిప్రాయ సేకరణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం కోల్ మైన్ పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం జెఎన్టిహెచ్ (మంథని) కళాశాల క్రీడా ప్రాంగణం నందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి భిక్షపతి అధ్యక్షత వహించారు.మంథని ఆర్.డి.ఓ సురేశ్ పాల్గొన్నారు.ప్రారంభంలో ప్రాజెక్ట్ వివరాలను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు తెలియజేశారు.వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఎన్.జి. ఓ.లు, పర్యావరణ ప్రేమికులు తెలిపిన అభిప్రాయాలను జిల్లా కలెక్టర్‌కి విన్నవించుకొన్నారు. చివరిగా రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రతిపాదనలకు తగిన చర్యలను చేపట్టరూ. ఈ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం విజయవంతం కావడానికి సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , జిల్లా కలెక్టర్ ,




పోలీస్ శాఖ వ, సమీప గ్రామాల సర్పంచ్ లకు, ప్రజా ప్రతినిధులకు, కార్మిక సంఘాల నాయకులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం 1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, రామగుండం2 ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య, ఎన్విరాన్మెంట్ జనరల్ మేనేజర్ బి.సైదులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, బి.జనక్ ప్రసాద్, పర్యావరణ అధికారి రాజారెడ్డి,కార్పోరేట్ పర్యావరణ అధికారులు, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## 45 రోజుల్లోగా ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి




**ప్రజాపక్షం/ఎడపల్లిః**ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఎడపల్లి ఎంపీడీఓ కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఫలితాలు వెల్లడైన నాటి నుంచి 45రోజుల గడువులోగా కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ప్రచారం కోసం చేసిన ఖర్చుల పూర్తి వివరాలు, బిల్లులు, అధికారిక ఖర్చుల బుక్‌లెట్‌ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పోటీ చేయడానికి వీరు అనర్హులుగా ప్రకటించబడతారని గెలిచిన అభ్యర్థులతో పాటు పోటీ చేసిన ఇతర అభ్యర్థులు కూడా ఈ నిబంధనను పాటించాలనిఅధికారులుస్పష్టం చేశారు. పారదర్శకతను కాపాడేందుకు అభ్యర్థులందరూ సహకరించాలని, చివరి నిమిషంలో రద్దీని నివారించడానికి ముందుగానే బుక్‌లెట్‌తో పాటు అన్ని రశీదులను సిద్ధం చేసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు.

## పెట్టుబడుల రంగంలో భారత్‌దే అగ్రస్థానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి : రాబోయే** రోజుల్లో పెట్టుబడుల రంగంలో భారత అగ్రస్థానం అవుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం రోజున ఢిల్లీ లోని ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో నెదర్లాండ్స్‌లో స్థాపితమైన ఫౌండేషన్ ఫర్ క్రిటికల్ ఛాయిసెస్ ఫర్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు (డిసెంబర్ 19, 20) నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి పెద్దపల్లి లోక్‌సభ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కాన్ఫరెన్స్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన పెద్ద సంఖ్యలో భారత డయస్పోరా పాల్గొనగా, “ఇండియా డయస్పోరా: డెడికేటెడ్ టు ది ప్రోగ్రెస్ ఆఫ్ ఇండియా” అనే అంశంపై జరిగిన సెషన్‌లో ఎంపీ మాట్లాడుతూ, భవిష్యత్ పెట్టుబడుల రంగం లో భారత్‌దేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంపారిశ్రామిక,వాణిజ్య,నూతనసాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందన్నారు. వికసిత్ భారత్ – 2047 రోడ్‌మ్యాప్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఈ దిశగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ ఇన్వెస్టర్లను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు.నెదర్లాండ్స్ – భారత్ మధ్య బంధాలు విడదీయలేనివని పేర్కొన్న ఎంపీ, ఆ ప్రాంతంలో పారిశ్రామిక విప్లవాన్ని సృష్టిస్తున్న ఎఫ్‌సీసీఐ సభ్యుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఎఫ్‌సీసీఐ ద్వారా దేశ అభివృద్ధికి, దేశ రుణాన్ని తగ్గించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు గర్వకారణమన్నారు.దేశంలో కాలుష్యం, పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణహిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ సంస్థ పర్యావరణ హితమైన బిల్డింగ్ మెటీరియల్, రూఫ్ సొల్యూషన్స్, సోలార్ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని, సోలార్ టైల్స్ కు యూఎస్ పేటెంట్ లభించటం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఎఫ్‌సీసీఐ అధ్యక్షులు అడ్వకేట్ జస్బీర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మెమెంటోతో సత్కరించారు. ఎఫ్‌సీసీఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ ఎఫ్‌సీసీఐ ఏర్పాటు చేసి 45 సంవత్సరాలు పూర్తవుతుండగా, ఈ ఏడాదితో భారత్ – నెదర్లాండ్స్ స్నేహానికి 75 ఏళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. భారత సంతతి వారిగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతోనే ఈ కాన్ఫరెన్స్ నిర్వహించామని అన్నారు. తెలంగాణ ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్యానెల్ డిస్కషన్‌లో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి విధానాలను వివరించారు. అలాగే పర్యావరణహితంగా విశాఖ సంస్థ తీసుకువచ్చిన ఉత్పత్తులు అద్భుతమని ప్రశంసించారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సముద్రాల సాయి కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ బిడ్డగా ఎఫ్‌సీసీఐలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని, నెదర్లాండ్స్‌లో పారిశ్రామికవేత్తగా కొనసాగుతున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా ఎదుగుతోందని పేర్కొన్నారు.

# అన్న ప్రసాద వితరణ భగవత్ కార్యక్రమం

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** అన్న ప్రసాద వితరణ అభినందనీయమని సివిల్ కాంట్రాక్టర్ పబ్బా చంద్రమోహన్ అన్నారు. శ్రీ భద్రకాళి వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలో చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పబ్బా చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మార్గశిర మాసంలో నిష్టతో కూడిన దీక్షలు కొనసాగుతాయని, ఇలాంటి సందర్భంలో భగవత్ కృపతో అన్న ప్రసాద వితరణ చేయడం పుణ్యకార్యమని కితాబిచ్చారు. సంవత్సరంలో ప్రతినెల ముఖ్యమైన రోజులేనని, అందులో మార్గశిర మాసం చాలా ప్రాశస్త్యం కలిగిన నెలగా భావిస్తూ భగవత్ సేవకు అంకితమవుతారని,ఇలాంటి రోజుల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టడం శుభసూచకమన్నారు.రెండు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి నెల అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ చేస్తున్నామని,సుమారు 600 మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. సంస్థ సభ్యుడు నల్లా దిలీప్ కుమార్ స్వీట్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వల్లాల వెంకటరమణ, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, సత్యనారాయణ రెడ్డి,నారాయణ రెడ్డి, చోల్లేటి, శ్రీధర్, చంద్రశేఖర్, గౌరిశెట్టి ధనుంజయ, పాములపర్తి కేశవ్ కుమార్, రామ్మోహన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ దంపతులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండలంలోని నాజీ తండాలో 25 ఏండ్లుగా ఒకే కుటుంబం నుండి సర్పంచ్‌లు బాదావత్ జ్యోతి బాలకిషన్ నాయక్‌లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలువగా ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పెద్ది వారిని శాలువాతో సన్మానించారు. నాజీ తండా గ్రామంలో గ్రామస్తులు ఒకే కుటుంబానికి పలు దఫాలుగా సర్పంచ్ పదవిని అప్పగిస్తూ అరుదైన రికార్డును సృష్టించారు. గ్రామ ప్రథమ పౌరుడిగా ఒకే కుటుంబ సభ్యులు సుదీర్ఘ కాలంగా సేవ చేసే అవకాశం లభించడం విశేషంగా మారింది. నాజీ తండా గ్రామానికి చెందిన బాదావత్ నాజీ నాయక్ కుటుంబానికి గ్రామస్తులు ఇప్పటి వరకు ఐదు దఫాలుగా సర్పంచ్ పదవిని అందించి ప్రజల మొప్పును చూరగొన్నారు.

# దుస్సా జనార్ధన్‌కు మహిళ న్యాయవాదుల మద్దతు




**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న దుస్సా జనార్ధన్ ప్రచారంలో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లా ల మహిళా న్యాయవాదుల తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మహిళ న్యాయవాదులు నిత్యం వృత్తి లో ఎదురయ్యే సదుపాయలు, వసతుల తదితర సమస్యల పరిష్కారం కోసం పలు హామీలు తెలిపారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మహిళ న్యాయవాదులను కోరారు. అనంతరం మహిళ న్యాయవాదులకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేసి వారికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మహిళ న్యాయవాదులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పోరాటానికి డిహెచ్ పిఎస్ మద్దతు



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామం ప్రజలు, రైతులు నిరుద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా, హన్మకొండ జిల్లాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా, హన్మకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శిలు సంఘీ ఎలేందర్, రోంటాల దేవా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారి భూములకు శిస్తు కడుతూ దున్నుకొని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న అయోధ్య పురం గ్రామ రైతులకు రైతు కూలీలకు నిరుద్యోగులకు యువకులకు వెంటనే ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పిస్తూ తక్షణమే రైల్వే ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పష్టమైన ప్రకటన చేయాలని దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేస్తుంది అన్నారు. ముఖ్యంగా అయోధ్య పురం గ్రామంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారి భూములను ఆ గ్రామ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఆ భూములకు శిస్తు కడుతూ దున్నుకొని సాగు చేసుకుంటున్నా భూములను కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు 160 ఎకరాల భూములను రైల్వే ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు తీసుకోవడం జరిగిందని ఆ సందర్భంగా ఆ గ్రామ ప్రజలకు నిరుద్యోగులకు యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి భూములను తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే ఉన్నతాధికారులు వెంటనే ఆ గ్రామ ప్రజలకు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాది కల్పిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయపోరాటానికి మద్దతుగా ఈనెల 21న అయోధ్య పురం గ్రామంలో జరిగే రౌండ్ సమావేశాన్ని జయప్రదం చేయడానికి అన్ని దళిత, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు భాగస్వాములై ఆ గ్రామ ప్రజలకు అండగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఇండ్ల నిర్మాణాన్ని సందర్శించిన ఎంసిపిఐ(యూ)



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తయిన అర్హులైన పేదలకు ఇవ్వకపోవడం సిగ్గుచేటని తక్షణమే పేదలకు పంచాలని లేకపోతే అర్హులైన పేదలకు పంచుతామని ఎంపిసిఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ హెచ్చరించారు. శుక్రవారం ఎంసిపిఐ(యూ) వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నగర నాయకత్వ ప్రతినిధి బృందం దూపకుంట పరిధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్రూంలను సందర్శించి నిర్మాణ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిలువ నీడలేని పేదల కోసం అన్ని సౌకర్యాలతో రెండు పడకల ఇండ్లను నిర్మించి ఇస్తామని ఎంతో వరంగల్ నగర పరిధిలో దూపకుంటలో సుమారు 2400 డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి పూనుకుంటే సగం మాత్రమే పూర్తికాగా మిగితావి అసంపూర్తిగా మిగిలిపోయి అసాంఘిక కార్యకలాపాలకు విలయంగా మారాయని పలు సందర్భాల్లో పూర్తయిన ఇండ్లను పంపిణీ చేయాలని అధికారుల యంత్రాంగానికి విన్నవించుకున్న ఫలితం శూన్యమన్నారు. అలాగే లక్ష్మీ టౌన్‌షిప్‌లో 210, తిమ్మాపూర్‌లో 456 నిర్మించి ఉన్నప్పటికి నేటికి పంపిణీ చేయకపోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. వెంటనే పంపిణీ చేయకపోతే అర్హులైన పేదలందరిని సమీకరించి ఎంసిపిఐ(యూ) ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని హెచ్చరించారు. పూర్తయిన డబల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, నగర నాయకులు ఎగ్గని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, మాలోత్ ప్రత్యూష, అప్పనపురి నర్సయ్య, మహమ్మద్ మెహబూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో రాణించాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల సురేందర్ రెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. టెన్నిస్ క్రీడ ఆడడం వల్ల ఫిట్నెస్, చురుకుదనం పెరగడం పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జిల్లాలో టెన్ టెన్నిస్ క్రీడా అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ హైదరాబాదులో జరిగే అండర్ 14, 19 పాఠశాలల రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో జిల్లా రాణించి వరంగల్ జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలో టెన్నిస్ క్రీడ అభివృద్ధి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్నిస్ క్రీడ ప్రవేశపెడితే అసోసియేషన్ నుంచి బ్యాట్స్, బాల్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అండర్ 19 ఆర్గనైజేషన్ సెక్రెటరీ శ్రీధర్, హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కుంజు బిహారి, మల్లారెడ్డి, కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకట్, వినీల్, ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్, సుభాష్, మల్లయ్య, అలేఖ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేరాజేందర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** గ్రేటర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 29వ డివిజన్ రామన్నపేటలో గత నెల అక్టోబర్ 30వ తేదీన కురిసిన అకాల వర్షాలకు చాలా ఇండ్లలో నిత్యావసర సరుకులు, సామాగ్రి నేలమట్టమైన కుటుంబాలకు పశ్రిమ ఎంఎల్‌ఏ నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చి నష్టపోయిన ప్రతి కుటుంబానికి ఎంతో కొంత ప్రభుత్వం తరుపున సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో తక్షణమే ముఖ్యమంత్రి 29వ డివిజన్‌కు సంబంధించి 932 కుటుంబాలకు 15000 చొప్పున వారి ఖాతాలో జమ చేయడం జరిగింది. పశ్చిమ ఎంఎల్‌ఏ నాయిని రాజేందర్ రెడ్డి ప్రభుత్వం తరుపున అందించిన సమయానికి డివిజన్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎంఎల్‌ఏ నాయిని రాజేందర్‌కు ముఖ్యమంత్రులు ఏ రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షులు పూర్ణచంద ర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పెద్దయెత్తున పాల్గొన్నారు.

# లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్




**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్ :** తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్ యూ) వరంగల్ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ (ఎస్ పీఈ యాక్ట్ 1976) ని పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్, కార్మిక శాఖ కార్యాలయం ముందు మెడికల్, సేల్స్ రిప్రెజెంటేటివ్స్ గంటపాటు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్నాకు ముందు ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుండి కలెక్టరేట్ వద్దకు ర్యాలీ నిర్వహించారు కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి,4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి, సిఐటియు జిందాబాద్, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ 4 కొత్త కార్మిక కోడ్లు వలన దేశం లో ఉన్న కార్మిక వర్గానికి, మెడికల్, సేల్స్ రిప్రెజెంటేటివ్స్ తీవ్ర అన్యాయం జరుగుతుందని, యూనియన్ ఏర్పాటు చేసుకొనే హక్కుని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కును కూడా కాలరాసేలా ఈ లేబర్ కోడులు ఉన్నాయని అలాగే మెడికల్, సేల్స్ రిప్రెజెంటేటివ్స్ కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ (ఎస్ పీఈ) యాక్ట్ 1976 కూడా రద్దు చేయడంతో దేశ వ్యాప్తంగా పని చేస్తున్న మెడికల్ రిప్రెజెంటేటివ్స్ కి ఫారం ఏ లో అప్పాయింట్మెంట్ లెటర్ రాకపోవడం, కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, గ్రాట్యుటీ చట్టం, ఇలాంటి ఎన్నో చట్టాలు అమలు ప్రశ్నార్థకంగా మారుతుందని రమేష్ తెలిపారు.

# జిపిఒ అధికారుల కమిటీ అధ్యక్షుడిగా సదానందం

**ప్రజాపక్షం/నల్లబెల్లి(నర్సంపేట):** గ్రామ పరిపాలన అధికారుల సంఘం అధ్యక్షునిగా సోనబోయిన సదానందం ఏకీగ్రీవంగా ఎన్నికున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షులు రాగం సుదర్శన్ తెలిపారు . శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల గ్రామ పరిపాలన (జిపిఒ ) అధికారుల నూతన కార్యవర్గం ఎన్నుకోనగా అధ్యక్షులుగా సోనబోయిన సదానందం ,ఉపాధ్యాక్షులుగా దాసరి సారంగం ,ప్రదాన కార్యదర్శిగా బి.నాగరాజ్ ,కోశాధికారి కె.రవికుమార్ ,బిఐలేష్ తదితరులను ఎన్నుకున్నారు . అనంతరం తహసిల్దార్ ఎం.కృష్ణను మర్యాద పూర్వకంగా కలువడంతో అభినందించి విధులను సక్రమంగా నిర్వర్తించి ఉన్నత అధికారులతో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో జిపిఓలు ఎం.గోవర్ధన్ ,రాకేష్ ,సందిప్ ,రాజేష్ ,శ్యామ్ ,ఆరోగ్యం ,ఉపేంధర్ ,చిరంజీవి తదితరులు పాల్గోన్నారు.

# మిల్లెట్స్‌పై వినూత్న ఎగ్జిబిట్స్ ప్రదర్శన

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** విద్యానగర్ సెయింట్ పీటర్స్ స్కూల్లో జరుగుతున్న హనుమకొండ జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో నక్కలగుట్ట ఎస్ఎమ్ఆర్ స్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని తేజస్వి ని చిరుధాన్యాల (మిల్లెట్స్) ప్రాధాన్యతపై అవగాహన కల్పించే వినూత్న ఎగ్జిబిట్ ప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో మిల్లెట్స్ ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువలు, సుస్థిర వ్యవసాయంలో వాటి పాత్రను సులభంగా వివరించడం సందర్శకులను ఆకట్టుకుంది. ఐదు రకాల చిరుధాన్యాలతో భారతదేశ పీఠాన్ని రూపొందించి ఏ రాష్ట్రంలో ఏ చిరుధాన్యం పడుతుందో అర్థమయ్యే రీతిలో చూపించారు. ఈ కార్యక్రమాన్ని మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ తిలకించి, విద్యార్థిని ప్రతిభను అభినందించారు. మిల్లెట్స్‌పై చిన్ననాటి నుండి చిన్నారులకు అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిన గైడ్ టీచర్లు గీత, సుహాసిని, మరియూ పాఠశాల కరస్పాండెంట్ ముక్తేశ్వర్ తదితరులను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి విద్యార్థి ప్రదర్శనలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యా సంస్థలు మిల్లెట్స్ వంటి ప్రజాహిత అంశాలపై మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.